
శత్రువు ఎవరో, శ్రేయోభిలాషి ఎవరో పోల్చుకోలేని సంక్లిష్ట సామాజిక సందర్భమిది. ప్రజల ఆశలు... ఆకాంక్షలు... ఆశయాలు మాత్రమే కాదు దినచర్యను కూడా శత్రువెవడో నిర్దేశిస్తున్నాడు... మార్కెట్టా? సంస్కృతా? రాజకీయమా... అన్నిటానా? అన్నిటి మిశ్రమమా? వెదికి శ్రేయోభిలాషి రూపంలోని శత్రువుని చూపడానికి ప్రయత్నించిన కథ

అట్టాడ అప్పల్నాయుడు

# 15

# శ్రేయోభిలాషి





'ఇట్లు, మీ శ్రేయోభిలాషి - ఆకాశరామన్న,' అని రాసేవారు పూర్వం! శ్రేయోభిలాషి పేరు కూడా చెప్పుకోలేని దినాలవి! ఆకాశరామన్న తన శ్రేయస్సు రీత్యా అలా రాసేవాడ్రా అనేవాడు నర్సింహులు మాస్టారు! పూర్వమేమోగానీ, నాకిపుడు శ్రేయోభిలాషి అనంటేనే భయం! నాకీ ఆగస్టు పదిహేనొస్తే డబ్భైయ్యేళ్లు నిండుతాయి! మూడేళ్ల కిందట మా ఊరికి శ్రేయోభిలాషి సర్పంచయ్యేడు! నా యిన్నేళ్ల వయసులో మా ఊరు మొత్తం చరిత్రలో ఇటువంటి శ్రేయోభిలాషినెరుగను! అతని వయసేమీ యెక్కువకాదు, నాకంటే ఖచ్చితంగా ఒక తరం చిన్నవాడే! అతనికంటే, నాకంటే పెద్దవయసు వాళ్లు చాలామంది మా ఊర్లో వున్నారు! కానీ, మా పెద్దవయసు వాళ్లందరి కంటే- మా ఊరి చరిత్ర తనకే యెక్కువ తెలుసంటాడతను! ఊరిజనంలో యెక్కువమంది నమ్ముతారు! ఇప్పటిదాకా యేదయితే మా ఊరి చరిత్రనుకున్నామో అదంతా తప్పంటాడు. డబ్భైయ్యేళ్ల కిందట యీ ఊరి కోసం ప్రాణాల ర్పించిన వారినీ, యీ ఊరి జనం కోసం జెయిలుకి వెళ్లినవారినీ, ధన, మాన, ప్రాణాలర్పించిన వారినీ ఒక్కోసారి పొగుడుతాడు, ఒక్కో సారి తెగుడుతాడు! పొగిడినపుడు ఆ కీర్తిశేషుల మూర్తిమంతమంతా అతనిలో కన్పిస్తుంది...! తెగిడినపుడు కూడా అతని మూర్తిమంతమే తేజోమయమై... కీర్తిశేషుల మూర్తులపై చీకట్లని కమ్ముతుంది! అప్పుడే, నా డెభ్భయ్యేళ్ల శరీరమూ గజగజా వణికిపోతుంది! అతను చాలా ఖరీదయిన దుస్తులు వేసుకుంటాడు. అతని చుట్టూ చాలా ఖరీదయిన మనుషులుంటారు! అతన్ని చూసినా, అతని మాటలు వినినా గుండెల్లో దడ పెరుగుతుంది. కానీ అతనేమో మీ శ్రేయోభిలాషి నంటుంటాడు! మా డబ్బా వీధి సుబ్బడయితే- ఊరిజనం చేసుకున్న పుణ్యఫలమే శ్రేయోభిలాషంటాడు!

మా ఊరు చాలా పెద్దది! చుట్టుపక్కల ఎర్రపాలేము తప్పా మా ఊరంత మరోటిలేదు! ముప్పయి వీధులుంటాయి! కొన్ని వీధులు ఒక్కో ఊరంత ఉంటాయి! అలాంటి వీధులవాళ్లు- మావి వేరే ఊళ్లు, మేము మీ ఊరిలో భాగం కాము... అంటుంటారు. కొన్ని వీధులలా విడిపోయేయి. కొన్ని వీధుల్లో వేర్పాటు గొడవలవు తున్నాయి! నా తాత్తండ్రుల వలన నాకు తెలిసిన నిజమేమిటంటే - ఇపుడేదయితే మా ఊరంటున్నామో, పూర్వం యిదంతా మా ఊరు

కాదు! అనేక చిన్నా, పెద్దా ఊళ్లు! ఎవరి మగ్గానికి వాళ్లే శనాపతులన్నట్టుగ, యే ఊరికా ఊరు యేలుబడీ, బతుకూ సాగేది. ఈ చిన్నా, పెద్దా ఊళ్లని పరాయి రాజులూ, చక్రవర్తులూ దాడులు చేసి పీడించేవాళ్లు! ఆ తర్వాత రాజుల్నీ చక్రవర్తుల్నీ పక్కకి తోసేసి, ఒక కంపెనీ పీడించడమారంభించింది. ఆ కంపెనీ చిన్న చిన్న ఊళ్లేమిటి చికాకు, చికాగ్గా అని భావించి, అన్నీ కలిపేసి ఒక ఊర్ని చేసింది! ఇకనుంచీ ఊరి మీదన కంపెనీదే అధికారమన్నది. అంతకుముందర రాజులూ, చక్రవర్తులూ కండ బలంతో పాలించినారా? ఇక అది చెల్లదన్నారు. కొన్ని శాసనాలు, చట్టాలు చేసినారు. చట్టప్రకారం పాలన చేస్తామన్నారు. కంపెనీ వలన తెలిసిందేమిటంటే చట్టప్రకారం పాలన చేసినా, వ్యాపారం చేసినా లాభం వారిదేననీ, నష్టం ప్రజలదనీ! అయితే కంపెనీ వలన ఒక మేలయ్యింది. ఊళ్లన్నీ యేకమయినాయి! ఐకమత్యమే మహాబలం అన్న సూక్తిని నిజం చేశాయి. కంపెనీ పీడనని తొలగించేయి.

అదిగో అప్పుడు నీను పుట్టేను! అప్పుడికి మా శ్రేయోభిలాషి పుట్టలేదు. అతని తాత్తండ్రులు యేవో చిన్నా, చితకా వ్యాపారాలు చేసుకునీవారు! బజారువీధి వాళ్లది! బ్రాహ్మలవీధి, నాయుళ్లవీధి, మాలవీధీ... ఇలా కులాల పేర్న మతాల పేరునా వీధు లేర్పడినాయి. మా శ్రేయోభిలాషికి యుక్తవయసు వచ్చేసరికి బజారువీధి వ్యాపారం తోటి కళకళలాడేది. అప్పుడతని పేరు- నారాయణమూర్తి! అప్పటికి నారాయణమూర్తికి లోకం బాగా అర్థమయ్యింది. లోకమర్థమయ్యేక లోకుల్ని పాలించాలన్న కోరిక పుట్టింది. యుక్తవయసులో దహించే కామంలా, నారాయణమూర్తికి పాలకుడవ్వాలన్న కోరిక దహించేది. వ్యాపారం చేసుకు బతికే తండ్రితో కోరిక చెప్పుకున్నాడు. తండ్రి వద్దన్నాడు! ఒద్దన్నకొద్దీ కావాలన్న కోరిక విజృంభించేది నారాయణమూర్తికి. అతనికి చిన్నప్పటి నుంచీ ఆ బలహీనతుంది. తల్లిదండ్రులు ఒద్దన్నదే చేసేవాడు. తోటిపిల్లల్లో ఆడుకోవాలి తప్పా, పోట్లాడకూడదంటే- పోట్లాడేవాడు! ఉపాధ్యాయుల్ని గౌరవించా లంటే- ఉపాధ్యాయుల ఇళ్ల మీద రాళ్లేయడం, వాళ్లు నడుస్తుంటే చాటుగా తుప్ప డొంకల్లో దాక్కొని, వాళ్ల కాళ్లల్లో కర్ర పెట్టడం చేసేవాడు! తండ్రి బడితేపూజ చేసేవాడు గానీ బుద్ధిమారలేదు. పెద్దయేకొద్దీ పెరిగింది. అంచేత తండి ఒద్దన్నా వినలేదు. బజారు వీధి వార్డు మెంబరుగా పోటీ చేశాడు. వ్యాపారస్తులెవరూ ఓటేయలేదు. ఓడిపోయేడు. నిద్రాహారాలు మానేశాడు. అపుడు తండ్రి ఒక స్వామి దగ్గరకు తీసుకువెళ్లి కడుపు చించుకొన్నాడు.

ఆ స్వామిగారు- పూర్వంలా దేహబలంతోనో, సైనికబలంతోనో ప్రజల్ని పాలించ లేరని, ప్రజల్ని నమ్మించి మాత్రమే పాలించగలరనీ చెప్పేడు. ప్రజలు దేవుడ్ని నమ్ముతారు! నువ్వు దేవుడ్ని నమ్ముకో! అని సలహా యిచ్చేడు! ఆ సలహా ప్రకారం నడుచుకోవడం ఆరంభించేడు. దేవుడ్ని నమ్మేకొద్దీ నారాయణమూర్తిని నమ్మే జనం పెరిగేరు. బజారువీధిలో నారాయణమూర్తి వెనక ఒక బృందం తయారయ్యింది.

అప్పుడా బృందంతో- కళకళలాడే బజారు మరింతగా కళకళలాడడానికి రామాలయం అవసరమన్నాడు.

బజారువీధి ఊరికి తూర్పున వుంటుంది. దగ్గరలో నది! ఊరిలోన ఇల్లులేని పేదలంతా నది ఒడ్డున పాకలు వేసుకొని వుంటున్నారు. ఆ స్థలం దేవాలయానికి పనికొస్తుందన్నారు వేదపండితులు! పేదల్లో కొందరు అల్లాని మొక్కుతారు, రాముడ్ని మొక్కరు! వాళ్లంతా అడ్డు తగిలేరు. అప్పుడు రంగమ్మీదకొచ్చేడు నారాయణమూర్తి! అల్లా తనకు కలలో కన్పించి పేదలకు పడమరవేపు ఖాళీస్థలంలో కోలనీ కట్టివ్వమన్నాడని చెప్పేడు! పడమరవైపు ఖాళీస్థలంలో కట్టబోయే కోలనీ ప్లానుని పెద్ద డ్రాయింగ్ షీటు మీద చూపించేడు. అక్కడే వారికోసం అన్ని వసతులూ యేర్పాటుచేసి, వారి శ్రేయస్సు చూడమన్నాడు అల్లా అని చెప్పేడు. అల్లా చెప్పిన కర్తవ్యాలు నెరవేర్చుతానన్నాడు, మీ శ్రేయోభిలాషినన్నాడు నారాయణమూర్తి! తొలిసారిగా నారాయణమూర్తి- మీ శ్రేయోభిలాషిని అన్న పదం అప్పుడు వాడాడు!

అల్లా భక్తులు తూర్పు స్థలం ఖాళీచేసి పడమరవేపు వెళిపోయేరు. కొంతమంది శ్రేయోభిలాషిని నమ్మలేదు, అల్లానే నమ్మేరు. వాళ్లకి పడమర స్థలం కోలనీలో ఇల్లు దొరకలేదు. తూర్పు స్థలమేమో ఖాళీచేయక తప్పలేదు... వాళ్లేమయినారో?!

బజారువీధిలో రామాలయానికి పెరిగిన భక్తుల కంటే నారాయణమూర్తికి భక్తులెక్కువ పెరిగేరు. ఏ బజారు వీధిలో ఓడిపోయేడో, ఆ బజారువీధిలో యేకగ్రీవంగా వార్డుమెంబరుగా ఎన్నికయ్యేడు. బజారువీధిలో యిపుడాయనకు యెదురులేదు. ఎదురుతిరిగినవాళ్లు పడమరకో, పరప్రాంతానికో పోవాల్సిందే! వార్డు మెంబరుగా అయ్యేక, ఊరిపంచాయితీ సమావేశానికి వెళ్లినపుడు పంచాయితీ సర్పంచ్ కుర్చీ చూస్తే, మనసులో అదోలా అయ్యేది నారాయణమూర్తికి! ఎలాగేనా, యెప్పటికయినా సర్పంచ్ కుర్చీలో కూచోవాలనుండేది.

సర్పంచ్ కుర్చీలో కూచోవాలంటే - బజారు వీధొక్కటే చాలదయ్యా, మిగిలిన పాతికపైన వార్డుల్లోన నీ పేరు మారుమ్రోగాలి. ధనం,దైవం...యీ రెండే యెవరి పేరునయినా మార్మోగిస్తాయి. ఆ ఎర్రజెండావాళ్లు ఆ రెంటికీ దూరం గనక, అధికారానికి దూరమయిపోయేరని స్వాములవారు ఉపదేశించేరు. స్వాములవారి ఉపదేశానుసారం నారాయణమూర్తి బజారువీధి దాటి తన పేరు మార్మోగడమెలా అని మథనపడేవాడు. ఊరేమో చాలా పెద్దది! ఇపుడపుడే, ఊరిలో తన పేరు మార్మోగడం కష్టం. సమయం పడుతుంది. ఈలోగా పేరున్న యేదో ఒక నాయకుడి వెనక నడుద్దామనుకొని, దేవాలయానికి వచ్చే ఒక నాయకునితో పరిచయం చేసుకొని, అతని అనుచరుడిగా వుండసాగేడు! ఆ నాయకుని అనుచరుడిగా తిరుగుతుంటే- ఒకటర్థమయ్యింది నారాయణమూర్తికి, అదేమంటే... ఈ నాయకుడి వెనక అనుచరుడిగా మిగిలిపోతానే తప్పా, తన జన్మలో తాను నాయకుడు కాలేనని! నాయకుడు చావాలి, అప్పుడేమో? కానీ నాయకుడు... యిపుడపుడే చచ్చేట్టులేడు... లోహపురుష్‌లా వున్నాడు! దాదాపు నారాయణమూర్తి నడివయసుకి వచ్చేశాడు!

అప్పుడే బజారువీధికి రెండు వీధులవతల బీ.సీ. వీధుంది. బీ.సీ. వీధి పెద్ద అమిరేశునాయుడు పరిచయమయ్యేడు. అమిరేశునాయుడు కూడా నడివయసుకి వచ్చేశాడు. లోకంలోని ఐశ్వర్యాన్నీ, భోగాన్నీ అనుభవించాలన్న దాహం యుక్తవయసు నుంచీ తీరలేదతనికి, నారాయణమూర్తికి లోకాన్ని ఏలాలన్న దాహం తీరనట్టు!

అమిరేశునాయుడి తండ్రి కలపవ్యాపారం చేసేవాడు! ఊరికి ఆనించి ఓ పెద్ద అడవుండేది, అందులో విలువైన వృక్షాలూ, చెట్లూ, చేమలూ, అడవిపంటలూ- అడివికి దగ్గర్లోని వార్డువాళ్లు అనుభవించేవారు! చాలా తక్కువ ధరకి ఊరిలోని సావుకార్లకి అమ్మేసేవారు! సారాకొట్టుకీ, సరదాలకీ డబ్బు తగలేసేవాళ్లు! కొన్నాళ్లకి ఆ అడవిలో కలప మిగల్లేదు! ఫారెస్టు అధికార్లు వీళ్ల మీద కేసులు పెట్టి జైల్లో పెట్టేరు. అడవి సంపదంతా అమిరేశు తండ్రి గోదాంలో వుందన్న సంగతి ఫారెస్టువాళ్లకీ తెలుసు, వార్డువాళ్లకీ తెలుసుగానీ- ఎవరూ నోరు విప్పేవారు కాదు! అలా అదుపులో పెట్టేవాడు అమిరేశు తండ్రి! అప్పుడే ఆ వార్డులోని కౌసల్యమ్మను రెండో భార్యగా తీసుకొచ్చేడు అమిరేశు తండ్రి! కౌసల్యమ్మకు తల్లిదండ్రీలేరు, అన్న వున్నాడు. అతను ఆ తర్వాత ఆ వార్డు మెంబరుగా పదవి పొందేడు. అమిరేశు తల్లి యెవరికీ చెప్పుకోలేక, సవతితో యిమడలేక అమిరేశుని తీసుకొని కన్నవారింటికి వచ్చేసింది!

అమరేశు తండ్రి ముసలివాడయిపోయి, వ్యాపారభారం మోయలేక కొడుకు అమిరేశుకి కబురు చేశాడు. చిన్న భార్యకు కొడుకుల్లేరు. ఇద్దరాడపిల్లలు! అమిరేశు అప్పటికి చదువూ, సంధ్యలు లేక వీధిలో బలాదూరుగా తిరిగేవాడు. తల్లి ఆర్థికంగా యిబ్బంది పడేది. ఎందుకీ యిబ్బందులు, తండ్రి దగ్గరకు వెళిపోదామనేవాడు. తల్లి ఒప్పుకునేదికాదు! యువకుడయ్యేడు! లోకం అందంగా, ఆకర్షణగా కనిపించసాగింది. కానీ అనుభవించాలంటే ఆస్తి, ఐశ్వర్యం వుండాల! అవి తండ్రి దగ్గరున్నాయి!వాట్ని తండ్రి నుంచి లాగేసుకోవానుండేది. తండ్రిని చంపేసయినా ఆస్తికి హక్కుదారు కావాలనుకునే వాడు! వారసత్వం కోసం కుటుంబాల్లో జరిగే హింసలను అమిరేశు అనేక రాజుల కథల ద్వారా తెలుసుకుని వున్నాడు! ఆ సమయంలోనే తండ్రి పిలవడం- రానన్న తల్లిని ఒదిలేసి అమిరేశు వెళ్లడం, ఆస్తికి వారసుడు కావడం, తండ్రికి మించిన తనయుడవడం జరిగేయి! కలప వ్యాపారానికి తోడు వంటసారా ఆరంభించేడు. తర్వాత ప్రభుత్వసారా, బ్రాందీషాపులు, బార్లలోకి దిగేడు. అమీరేశుని యారక్ కింగ్ అంటారంతా!

అమిరేశుకి వ్యాపార శత్రువులున్నారు. ఆ శత్రువులకు అధికారపార్టీ మద్దతుండేది. దాంతో వాళ్లు అమిరేశు మీద ఎక్సయిజ్ వాళ్లనీ, ఇన్‌కం టేక్సువాళ్లనీ వొదిలేవారు. వ్యాపారరీత్యా గొడవలు సహజం. గొడవల్లో అమిరేశు మూక యెపుడన్నా యెవరినన్నా కొట్టి, చంపుతుంది. అపుడూ శత్రువులు అమిరేశు మీదకి పోలీసుల్నీ, సీబీఐ వాళ్లనీ ఉసిగొల్పేవాళ్లు! అంచేత శత్రువుల్ని జయించాలంటే తను అధికార పీఠం మీద వుండాలి, లేదా తన మనిషి అధికార పీఠమ్మీద వుండాలని తెలుసుకున్నాడు.

సారా సిండికేట్లనూ, కలప స్మగ్లింగూ, లాడ్జింగు హవుస్, హోటళ్లు నడిపే వాళ్లనీ... నాయకులుగా ఎన్నుకునేంత స్థాయికి, ఓటర్లు అప్పటికి యెదగలేదు! రాజకీయాల్లో వుండేవాళ్లనీ, భూస్వాముల్నీ, డాక్టర్లనీ, లాయర్లనీ, బ్రాహ్మర్లనీ... అలాటివారిని నాయకులుగా ఎన్నుకునేవారు! ఓటర్లు ఆ స్థాయికి వచ్చేసరికి అమిరేశూ నడి వయసుకి వచ్చేశాడు. నారాయణమూర్తిలాగా!

వీళ్లిద్దరూ చేతులు కలిపేనాటికి ఊరిలో అనేక రాజకీయార్థిక మార్పులు జరిగేయి! లోకాన్ని యేలాలన్న తీరని కోరికతో ఒకరూ; లోకంలోని ఐశ్వర్యాన్నీ, భోగాన్నీ అనుభవించాలన్న తీరని కోరికతో యింకొకరూ. విసిగెత్తి వున్న వీళ్లిద్దరిలా- ఊరంతా అప్పటికి పీఠమ్మీద కూచొని యేలినవారందరి మీదా విసిగిపోయి వుంది!

కంపెనీ ఊరినొదిలి వెళ్లిపోయిన తొలినాటి ఎన్నికల్లో బ్రాహ్మణ వీధికి చెందిన పెద్దాయన ఊరికి నాయకుడయ్యేడు. అతగాడు తెల్లగా, పొడవుగా వుండేవాడు. కంపెనీవాళ్లని పొమ్మని పొగ పెట్టిన వాళ్లలో యీయనొకడు. ఈయనకు అన్ని వీధుల వాళ్లూ మద్దతిచ్చేరు. కంపెనీవారు మా ఊరిలో రోడ్డేసేరు, రైలు నడిపేరు, వంతెనలు కట్టేరు! వాటితోపాటు జైళ్లూ కట్టేరు. రాజులూ, జమీందార్లూ, కంపెనీవోళ్లూ నివశించిన భవంతుల్ని- ఆళ్లు పోయాక మా వూరివాళ్లే పరిపాలనా భవంతుల కింద కొన్ని వాడే వారు. మరికొన్ని భవంతుల్లో బ్రాహ్మలూ, రెడ్లూ, కమ్మలూ, కరణాలూ పెద్ద కులా లోళ్లు యేలికలయినారుగదా ఆళ్లు నివశించీవోరు! మాలమాదిగ కులపెద్దలు కొంత మందికి కూడా అపుడపుడూ ఆ భవంతులు దొరికేయి. జెయిళ్లలోన కంపెనీ రోజుల్లో ఈళ్లూ, ఆళ్లూ అందరూ నిర్బంధన అనుభగిస్తే, యిపుడు పేదోడూ, కులం తక్కువోడూ అనుభగిస్తన్నాడు! కంపెనీ ఊరి నుంచి వెళ్లిపోగానే బ్రాహ్మలు ఊరిమీద అధికారాన్ని చలాయించితే, ఆళ్ల దన్నుతోటి పెద్దకులాల వాళ్లూ, పెద్ద పెద్ద వ్యాపారాలు చేసేవాళ్లూ ఊరి సంపదని నొల్లుకోవడం ఆరంభించేరు.

చిన్నా చితకా ఊళ్లుగా ఉన్నపుడు నుంచీ భూమి పంపకం జరగలేదు. భూమిని దున్ని పంటలు పండించే రైతుని పీడించుకు తినేవాళ్లు రాజులు, జమీందార్లూ ! ఏ యేడాది యెంత శిస్తో, దస్తో లెక్కా జమా వుండదు. రాజుగారికి ఖర్చెక్కువుంటే శిస్తూ, దస్తులు పెరిగేవి. కంపెనీ రోజుల్లోనూ అంతే! భూమికి శిస్తు నిర్ణయించి రాజులకీ, జమీందార్లకీ భూమ్మీద హక్కిచ్చింది కంపెనీ. కంపెనీకి కట్టాల్సిన శిస్తూ, దస్తులకు వీళ్ల ఖర్చులూ, కరామత్తులూ కలుపుకొని రైతుల కాడ వొసూలు జేసీవోరు రాజులు, జమీందార్లూ! అన్నమో రామచంద్రా అనేవారు రైతులు!

కంపెనీని ఊరినించి తరిమీసినపుడు... ఊళ్లల్లోని భూమి సమస్యని పరిష్క రిస్తామన్నారు, గానీ పరిష్కరించలేదు. దున్నేవానికే భూమి అని కొన్ని వీధుల్లోని రైతులు యుద్ధం చేసినారు. నీనపుడు ఉయ్యాలబిడ్డని! గద్దెమీదన కూచున్న పొడవాటి తెల్లటి నాయకుడు ఊరిని అభివృద్ధి చేయడానికీ, ప్రజలందర్నీ బాగుచేయడానికీ పంచవర్ష ప్రణాళిక తయారుచేయించేడు. పాఠశాలలు, ఆసుపత్రులు, రోడ్లు, భవంతులూ

చకచకా అయిదేళ్లకో వార్డులెక్కన ఊరంతా లేచేయి. ఇంకా ఊరికి ఆనించి మూడు దిక్కుల నదులున్నాయి. ఆటిమీద ఆనకట్టలు, రిజర్వాయర్లు లేపేరు. భూములకి నీళ్లందించేరు. కొన్ని వార్డుల భూముల్లో బంగారం పండీసీవి! ఊరు పూర్వమ్మీద అభివృద్ధి అయ్యింది. పెద్ద పెద్ద మేడలు, పెద్దపెద్ద కార్లూ, ఇనప బీరువాలు పట్టని సంపదలనూ కొందరిళ్లల్లోకి పంచవర్ష ప్రణాళికలు వర్షించేయి. వార్డుల్లో నూటికి నలుగురైదుగురు అమీరులూ, మిగిలిన తొంభయ్యయిదుగురో, తొంభయ్యారుగురో గరీబులూ అయినారు. ఊరిలోని అన్ని వార్డుల్లోని గరీబులూ గోలా, గోసా పెట్టేరు. కమీనిస్టోలు కొన్ని వార్డుల్ల అగ్గి పుట్టించేరు. ఈలోగా తెల్లటి పొడవాయన స్వర్గానికి వెళిపోయేడు. అతని స్థానంలోకి బ్రాహ్మణవీధిలోంచే మరొకాయన వచ్చేడు. ఆయన పొట్టిగా వుంటాడు. కొద్దికాలమే వున్నాడు, ఆయనా స్వర్గానికి వెళిపోయేడు. తరాత పొడుగాయన కూతురు రంగంలోకి వచ్చింది. గరీబుల్ని గోలా, గోసా పెట్టొద్దన్నాది. గరీబీ హఠావో... అని పథకాలేవో పెట్టింది. అయినా పేదరికం పెరిగింది. కమీనిస్టులు రెండు, మూడు వార్డులు గెలుచుకున్నారు. అలాగ ఊరంతా గెలొచ్చనుకున్నారు. గెలుపు కోసం బ్రాహ్మణవీధి పెద్దలెలాగ నడిచేరో అలాగే కమీనిస్టులూ నడవడంతో, ఆ వార్డుల్లోన ఆళ్లకి వ్యతిరేకంగా అగ్గి లెగిసింది. కంపెనీవాళ్లూ, బ్రాహ్మణపెద్దలూ యెలాగయితే అగ్గిని ఆర్పేవారో అలాగే కమీనిస్టులూ అగ్గిని ఆర్పడానికి ఒకవేపు పూను కున్నారు. ఇంకోవేపు బ్రాహ్మణవీధి పెత్తనమ్మీద విమర్శ చేసేవాళ్లు! ఈలోగా తూర్పు వేపు వార్డుల్లోన అగ్గి లెగిసింది. ఊరు, ఊరంతా ఆ అగ్గి అంటుకుంటాదేమోనని ముందు జేగర్తపడింది గద్దెమీదున్నావిడ! అగ్గిమంటలు వేసినోళ్లనేగాక, అటూయిటుగా ఆవిడ్ని వ్యతిరేకించినోళందర్నీ జెయిళ్ల పెట్టించింది. ఊరిజనం గగ్గోలు పెట్టేరు.

అప్పుడికి మా శ్రేయోభిలాషి వార్డు మెంబరు కాలేదు. తండ్రి వెనకాల వ్యాపారం చేసుకునీవోడు! అందుకనీ జైలు యోగం తప్పోయిందతగానికి! అతగానీ తాలూకా వాళ్లు కొందరు జెయిలుకెళ్లారు. ఆళ్లూ, కమీనిస్టులూ, ఊర్లోని మరికొంతమంది పెద్దలూ... ఒక జట్టయి, అమ్మని గద్దెమీద నించి దించేసినారు. జట్టులోని ఒకాయనని గద్దెనెక్కించినారు. కానీ జట్టులోన గొడవలు, జట్టు విడిపోవడం... తరాత కొన్నాళ్లకి అమ్మ గద్దెనెక్కడం, అమ్మని తరాత యెవరో చంపీడం, అమ్మ కొడుకు గద్దె యెక్కడం... ఆయన చనిపోడం... అదంతా పెద్దకత!

ఈలోగా జరిగిందేటంటే- ఊరి ప్రజలంతా అప్పటిదాకా వార్డుల్లోన నాయకులుగా వున్న అందర్నీ వ్యతిరేకించసాగేరు. అందరూ దొంగలేనని గ్రహించేరు. కొందరు గడ్డి తిన్నారు. కొందరు భూముల్ని కలిపేసుకున్నారు. కొందరు పాలు తాగేశారు. కొందరు రైలుపెట్టెలు దోచేశారు, కొందరు ఇనుము దొంగతనం... యిలాగ గద్దెమీద కూచుని ప్రజల్నీ, ఊరినీ దోచుకున్నారని తెలుసుకున్నారు. కొన్ని వార్డులు ఊరితో తెగతెంపులు చేసుకుంటామని దెబ్బలాడేయి. గందరగోళంగా తయారయినాయి ఊరి రాజకీయాలు!

ప్రజలు విసిగిపోయి ఒకసారి ఒక గుంపునీ, మరోసారి మరో గుంపునీ గెలిపించే వాళ్లు, కొంతయినా గద్దె మీదున్న వాళ్ల అక్రమాలు తగ్గుతాయని! అదీగాక ఓట్లమీద ప్రజలకు విసుగొచ్చేసింది- ఎవడికి ఓటేసినా ఒరిగిందేమీ లేదని తెలుసుకున్నారు. అంచేత ఓటుకోసం అభ్యర్థులెవరయితే నోటు యిస్తారో వారికే ఓటు వేసేవారు. ఒకోసారి నోటు ఒకని దగ్గర తీసుకొని, మరొకనికి ఓటేసేవారు. చెల్లని ఓటేసేవారు, యిలా తిరస్కరించేవారు ఓటింగుని! ఇంతకుముందు ఊరిలోని కొన్ని వార్డుల్లో కమ్యూనిస్టులేనా గెలిచేవారా... యిపుడదీ లేదు. కమ్యూనిస్టుల్నీ ఓడించి బుద్ధిచెప్పే వాళ్లు ప్రజలు! పోరాటాలు తప్పా, ఓట్లేటర్రా అని! ఓటుకి నోటు యెపుడయితే వొచ్చిందో, నోట్లు మూలుగుతున్న వ్యాపారస్తులు దిగిపోయేరు. వ్యాపారస్తులదే పీఠమయిపోయింది!

అలాంటివాళ్లు నాయకులయ్యేక... అమిరేశులాంటివాళ్లకీ, వాళ్లకీ తేడా కనపడ లేదు జనానికి! అప్పట్నించీ అమిరేశులాంటి వాళ్లనీ నాయకులుగా గెలిపించసాగేరు! సరిగ్గా ఆ సందర్భంలో అమిరేశుకి వ్యాపారమొదిలేసి రాజకీయాల్లోకి దిగుదమా అనన్పించింది. కానీ సంశయించేడు - తన పర్సనాల్టీ గూడా ఓటర్లని ఆకర్షించదని (తొండం లేని ఏనుగులా వుంటుంది ఆకారం)!

ఈ రోజుల్లోనే ఆ పడమర స్థలంలోని అమిరేశు సారాకొట్టు గొడవ ఓసారి నారాయణమూర్తి దగ్గరకు వచ్చింది. అమిరేశు మనుషులు నానాగొడవలు చేస్తున్నా రనీ, యేమేనంటే కొడ్తున్నారనీ గాయాలతో ఓసారి అల్లాభక్తులు యేడుస్తూ నారాయణ మూర్తి దగ్గరకు వచ్చేరు, తమ శ్రేయోభిలాషని! నారాయణమూర్తి- సారా తాగడం తప్పు, గొడవలు పడడం తప్పు, కుటుంబాలు చెడిపోతాయి... అని హితబోధ చేసేడు. ఇలాంటి గొడవల్లో నేను కల్పించుకోను, నాదగ్గరకు రావద్దనేశాడు! యా... అల్లాహ్ అనుకుంటూ వెళిపోయేరు వాళ్లు!

అప్పుడే అమీరేశు... యెందుకయినా మంచిదని నారాయణమూర్తిని కలిసేడు. నారాయణమూర్తి మొహం జూలు లేని సింహంలా వుంటుంది! అంతకుముందెప్పుడూ వాళ్లిద్దరూ యెదురవలేదు. అదే తొలిసారి! ఈడేటా... తొండం తెగిన ఏనుగులాగ అని నారాయణమూర్తీ; ఓరిబాబో, జూలు లేని సింహంలాగున్నాడేటా ఈడని అమిరేశూ విస్తుపోయేరు ఒకర్నొకరు చూసి! ఇలాటోడ్ని గట్టెక్కించొచ్చు, మనిషిల ఆ కళ కన్పిస్తంది! ఈడ్ని రంగంల దించుదాం అనుకున్నాడు అమిరేశు. ఆరోజే, అమిరేశు- తన వ్యాపారసామ్రాజ్యాన్ని గురించి ఆచూకీ యిస్తూ, తన శత్రువుల అక్రమాల్ని వివరించేడు. ఆ శత్రువుల్లో చాలామంది నారాయణమూర్తికీ శత్రువులే రాజకీయంగా! ఆయా వార్డుల్లో వాళ్లు తనకి ప్రత్యర్థులు. అధికార బలంతో వార్డుల్లో తన అభ్యర్థులను ముప్పతిప్పలు పెడుతున్నారు. ఏనాటికేనా ఊరి సర్పంచ్‌గా గద్దె యెక్కాలంటే, శత్రువుల్ని జయించాలి. శత్రువుకి శత్రువయిన యితగాడు మనకి మిత్రుడనుకున్నాడు నారాయణమూర్తి!

ఎవరికేది కావాలో- అందుకెవరేమి చేయాలో స్పష్టపరుచుకున్నారు! ఊరి సర్పంచ్ పదవి నారాయణమూర్తికీ, ఊరి వ్యాపారసామ్రాజ్యం అసిర్నాయుడికీ! ఇక వాటిని వాళ్లు... యెవరికెలా వార్డుల్లో సర్దుకుంటారో వారి, వారి అభీష్టమ్మేరకే! ఒకరి వ్యవహారంలో యింకొకరు జోక్యం చేసుకోరు! ఇద్దరూ కలిసి- యితరుల జోక్యాన్ని ఒప్పుకోరు...! అలా ఒక మంచిరోజున ఒప్పందం కుదిరింది- ఏనుగుకీ, సింహానికీ! ఇక ఆనాటి నుంచీ యిద్దరూ ఒక్కటయిపోయేరు. శతృవుల మీద శంఖమూదేరు. ప్రజల ఓట్లు పొందడానికి ధనమూ, దైవమూ మార్గమని నారాయణమూర్తికి స్వాముల వారు ఉపదేశించేరుగానీ- వాటితోపాటూ సారా వుండాల, అగ్గిలోన దూకమంటే దూకే మూక ఒకటుండాలన్నాడు అమిరేశు!

ఈ చరిత్రలోంచి, ఈ క్రమంలో నారాయణమూర్తి- ధనమూ, దైవమూ, మద్యమూ గాక నెత్తురు గూడా గద్దెకు అవసరం అని తెలుసుకున్నాడు! నెత్తురు మన మూకదయినా సరే, శతృమూకదయినా సరే పారాలి! అతని గురువులు కేవలం దైవం, ధనమూ చాలుననుకుని, గద్దెకి దగ్గరగా ఆగిపోయేరనీ- ఒకానొక రోజున నారాయణమూర్తీ, అమిరేశూ ఉమ్మడిగా యెరుక పొందేరు! మద్యమెంతటి మత్తు నిస్తుందో దైవమూ అంతటి మత్తునిస్తుందని గూడా నారాయణమూర్తి... ఓసారి అమిరేశుకి ఋజువు చూపేడు! అదృష్టవశాత్తూ నెత్తురు పారే అవసరం లేకుండా నారాయణమూర్తి... మొన్నటి ఎన్నికల్లో ఊరికి సర్పంచయినాడు! ఛాతీపొంగించేడు- ఇన్నాళ్లూ ఊరిని దోచుకుతిన్న శతృవుల్ని యెవర్నీ వొదలనన్నాడు. తిన్నదంతా కక్కిస్తా నన్నాడు. ఊరిప్రజల శ్రేయస్సుకోసం యిక నా జీవితమన్నాడు! ఊరి శ్రేయోభిలాషి నన్నాడు!

నారాయణమూర్తి సర్పంచయ్యేక ప్రజలకు కొత్త పూనకం వచ్చింది. బజారు వీధి వ్యాపారులూ, బీ.సీ. వీధి వ్యాపారులూ ఐక్యమయిపోయేరు. పరాయి ఊళ్లల్లోని వాళ్ల బంధుబలగాన్నీ కలిపేసుకొని అమీరేశు వెనక పెద్ద వ్యాపార సామ్రాజ్యం యేర్పడి పోయింది. ఇటు శ్రేయోభిలాషి తాన... అనంటే ప్రజలు తందాన అనేవారు! దొంగ లరుగో అల్లక్కడున్నారు, వెదికిపట్టుకోండి, వారి భరతం పడతాననేవాడు... శ్రేయోభి లాషి. ప్రజలు దొంగలకోసం నిద్రాహారాలు మానేసి వెదుకులాడేవారు! ఈ వెదుకు లాటలో పక్కనున్నవాడే దొంగగా కనబడసాగేడు ప్రజలకు! నిన్నటిదాకా ఊర్ని దోచుకునే వాళ్ల రెండు కళ్లూ పోవాలంటే- మీరు ఒక కంటిని పోగొట్టుకోవాలన్నాడోసారి! శ్రేయోభిలాషి మాటప్రకారం క్యూల్లో నిల్చొని ప్రజలంతా ఒక్కో కంటినీ పొడుచు కున్నారు! రెండు కళ్లు పోయిన దొంగ ఒకడూ కనబడలేదు! అడుగో శతృవు ఊరి సరిహద్దులో మంట పెట్టేడు. మనం వాడి ఇంటిలో మంట పెట్టాల, అపుడే శతృవు భయపడతాడు. అరి వీర భయంకరులారా నా వెంట నడవండన్నాడు! వెంటనడవని వాడే ఊరికి ద్రోహి అనన్నాడు!

ఊరివీధులు శుభ్రంగా లేవన్నాడోసారి, వీధుల్లోన పసిబిడ్డల్ని చంపి పాపం చేస్తున్నారన్నాడొకసారి! ఆడవారు మన పురాణసంస్కృతిని వొదిలేస్తున్నారన్నాడోసారి! గుండెలు బాదుకొని శ్రేయోభిలాషి ప్రజలకు అక్రమాలన్నీ వినిపించేవాడు! నిజమే... వీధులు శుభ్రంగా లేవు. నిజమే పశువుల్ని చంపుతున్నారు. ఔనౌను, ఆడవాళ్లు మారి పోయేరు -ఊరంతా ఇవే మాటలు! సమాజశ్రేయస్సు కోసం తాను ఆదేశిస్తే, అగ్గిలో దూకే ఓ సమూహాన్ని తయారుచేసుకున్నాడు నారాయణమూర్తి! అక్కడక్కడా నాలు గయిదు వార్డుల్లో నారాయణమూర్తి వ్యతిరేకులు వార్డు మెంబర్లుగా నెగ్గివున్నారు! సమాజ శ్రేయస్సుకి భంగంగా వుంటోందన్నాడు! సమాజశ్రేయస్సుకోరే సమూహం ఆ వార్డుల్లో అగ్గి రగిలించి, అందులో దూకి- నారాయణమూర్తి వ్యతిరేకుల్ని పీఠమ్మీంచి దించేసారు!

ఇంక యే సమస్యా లేదన్నాడు నారాయణమూర్తి! అమరేశు ఔనౌన్నాడు! ప్రజలొక్కసారి విస్తుపోయేరు- ఎక్కడి సమస్యలక్కడే వున్నాయి, యే సమస్యా లేక పోవడమేటి? దున్నడానికి భూములేవి? చెయ్యడానికి నౌకరీలేవి? ఉండడానికి ఇళ్లేవి? అసలు బాధలన్నీ అలగే వుండగా- ఈ ఆవులు యేటి? ఈ చావులు యేటి? ఆడోళ్లేటి? మారిపోడమేటి? ఊరి సరిహద్దుల మంటలేటి... అని ప్రశ్నించుకొని కళ్లు పులుము కోబేతే- ఒక్క కన్నే తగిలింది చేతులకు! శ్రేయోభిలాషి వలన రెండు కళ్లల్లో ఒకటి పోయింది యిప్పటికి! మళ్లీ గెలిపిస్తే- రెండో కన్ను పోద్దేమోనని... భయం, భయంగా వుందండీ! నా వయసు ఈ ఆగస్టుకి డెభ్భయ్యేండీ! కళ్లుంటే యేమీ, లేకపోతే యేమీ, ఈ వయసులో అంటారా? ఊరిశ్రేయస్సు కోసం ఆ మాత్రం త్యాగం చేయకపోతే యెలాగంటారా? ఊరి ద్రోహినంటారా? ఓలమ్మో...!

*చినుకు మాసపత్రిక*
*డిసెంబర్ 2017*

*




**అట్టాడ అప్పల్నాయుడు** 23 ఆగస్టు 1953న శ్రీకాకుళం జిల్లాలో జన్మించారు. మొదటి కథ **పువ్వుల కొరడా** 1988లో సృజన మాసపత్రికలో అచ్చయ్యింది. దాదాపు వంద కథలు, నాలుగు నవలలు, వ్యాసాలు, నాటకాలు రాశారు. సంపూర్ణ సాహిత్యం మూడు సంపుటాలుగా వెలువడింది. ఉత్తరాంధ్ర పత్రిక సంపాదకులు. *పోడు-పోరు, ప్రత్యామ్నాయం, ఒక పొట్టివాడు-కొందరు పొడుగువాళ్లు, బీల, క్షతగాత్ర గానం* కథా సంపుటాలు ప్రచురించారు.

*చిరునామా: ప్లాట్ నెం. 203, మాయిల్లు అపార్ట్‌మెంట్స్, వంశధార నగర్, శ్రీకాకుళం-532001. ఫోన్: 94400 31961*
***attada.a@gmail.com***